క్లుప్తంగా

డ్రమ్‌సీడర్ పద్ధతిలో అధిక దిగుబడి



డ్రమ్‌సీడర్‌ను పరిశీలిస్తున్న అసిస్టెంట్ డైరెక్టర్ ఆఫ్ అగ్రికల్చర్ మురళి

రామగిరి: డ్రమ్‌సీడర్ పద్ధతిలో వరి నాటడం ద్వారా తక్కువ ఖర్చుతో అధిక దిగుబడి సాధించి కూలీల కొరతను అధిగమించవచ్చని మంథని అసిస్టెంట్ డైరెక్టర్ ఆఫ్ అగ్రికల్చర్ మురళి సూచించారు. రామగిరిఖిల్లా కృషి విజ్ఞాన కేంద్రంలో వ్యవసాయ శాఖతో కలిసి డ్రమ్‌సీడర్ సాంకేతికను ఉపయోగిస్తూ వరిసాగులో మెలకువలు అనే అంశంపై శుక్రవారం నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. దత్తత గ్రామాల్లో డ్రమ్ సీడర్‌ను రైతులకు పంపిణీ చేశామన్నారు. శాస్త్రవేత్తలు బి.భాస్కర్‌రావు, డా.కిరణ్, డా.వినోద్ కుమార్, మండల వ్యవసాయాధికారి డా.ప్రమోద్‌కుమార్, అధికారులు, రైతులు పాల్గొన్నారు.

డివిజన్ సమస్యలు పరిష్కరించాలి

ఫెర్టిలైజర్‌సిటీ: రామగుండం కార్పొరేషన్ 14వ డివిజన్ పరిధిలోని సమస్యలను పరిష్కరించాలని కాంగ్రెస్ 14వ డివిజన్ అధ్యక్షుడు బూర్ల శ్రీనివాస్ శుక్రవారం నగరపాలక కమిషనర్ శ్రీకాంత్‌కు వినతిపత్రం అందించారు. డివిజన్‌లో క్షేత్రస్థాయిలో పర్యటించి సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని కమిషనర్‌ను కోరారు. కాంగ్రెస్ నాయకులు ఉన్నారు.

అభివృద్ధి పనుల పరిశీలన

రామగుండం: అంతర్గాం మండల పరిధిలోని ఆకెనపల్లి, విలేజి అంతర్గాం, టీటీఎస్ అంతర్గాం గ్రామాల్లో 15వ ఆర్థిక సంఘం నిధులు, ఎస్‌డీఎఫ్ నిధులతో చేపట్టిన అభివృద్ధి పనులను శుక్రవారం ఎంపీడీవో ఎం.ఎ.అలీం పరిశీలించారు. ఈ సందర్భంగా సీసీ డ్రైనేజీలు, సీసీ అంతర్గత రహదారుల నాణ్యతా ప్రమాణాలపై సంబంధిత కాంట్రాక్టరు దామోదర్‌రావును అడిగి తెలుసుకున్నారు.

ఉచిత వైద్య శిబిరం వినియోగించుకోవాలి

ఎలిగేడు: జిల్లా పద్మశాలి సేవా సంఘం అడ్‌హక్ కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం మండల కేంద్రంలో నిర్వహించే ఉచిత గుండెపరీక్ష శిబిరాన్ని మండల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సంఘం అడ్‌హక్ కమిటీ చైర్మన్ వల్స నీలయ్య కోరారు. మండల కేంద్రంలో పద్మశాలి సంఘం భవనంలో విలేకరులతో మాట్లాడారు. ఎలిగేడు జెడ్పీహెచ్ఎస్ పాఠశాలలో ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంటవరకు మెడికవర్ హాస్పిటల్ కరీంనగర్ వారి సౌజన్యంతో నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. అడ్‌హక్ కమిటీ సభ్యులు మామిడాల రమేశ్, పెద్ద చందు, ఆడెపు అంబుదాస్, గాదాసు రవీందర్, మాజీ ఎంపీటీసీ బూర్ల సత్యనారాయణ, కొండ సత్యనారాయణ, పద్మశాలి సంఘం గ్రామ అధ్యక్షులు బూర్ల సత్యనారాయణ, వీరేశం పాల్గొన్నారు.

ఫుడ్ లైసెన్స్ తప్పనిసరిగా తీసుకోవాలి



తనిఖీ చేస్తున్న అమృతశ్రీ

సుల్తానాబాద్: ఫుడ్ వ్యాపారులు తప్పనిసరిగా ప్రతి ఒక్కరూ లైసెన్సులు తీసుకోవాల్సిన బాధ్యత ఉందని జిల్లా ఫుడ్ ఇన్‌స్పెక్టర్ అమృతశ్రీ అన్నారు. పట్టణంలో ఆహార పరిరక్షణ విభాగం వారు శుక్రవారం సాయంత్రం ఆకస్మికంగా తనిఖీ చేశారు. పలు దుకాణాలలో గడువు దాటిన ఐస్ క్రీమ్స్ ఇతర సామగ్రి గుర్తించినట్లు తెలిపారు. పలు రకాల తిను బండారాలు తయారు చేసే ప్రాంతంలో అపరిశుభ్రంగా ఉన్నందున నోటీసులు జారీ చేశారు. హోటల్ పరిసరాల్లో పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. లైసెన్స్ తీసుకోవడంతో పాటు రిజిస్ట్రేషన్ విధిగా ఉండాలని కోరారు. నియమ నిబంధనలు పాటించని హోటళ్లపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా నడిపిన వారిపై చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

మంథని ప్రీమియర్ లీగ్ క్రికెట్ పోటీలు ప్రారంభం

మంథని: మంథని ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో ప్రీమియర్ లీగ్ క్రికెట్ పోటీలను మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు సోదరుడు శ్రీనుబాబు శుక్రవారం ప్రారంభించారు. క్రీడాకారులను పరిచయం చేసుకొని బ్యాటింగ్ చేసి క్రీడాకారుల్లో ఉత్సాహం నింపారు. క్రీడాకారులకు టీ షర్టులు అందించారు. మున్సిపల్ చైర్‌పర్సన్ పెండ్రి రమ, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ఐలి ప్రసాద్, పట్టణ అధ్యక్షుడు పోలు శివ, కిసాన్ సెల్ జిల్లా అధ్యక్షుడు ముస్కుల సురేందర్‌రెడ్డి, నాయకులు వొడ్నాల శ్రీనివాస్, గోటికార్ కిషన్ పాల్గొన్నారు.

ప్రతినెలా ఉచిత మెడికల్ క్యాంప్



మెడికల్ క్యాంపు నిర్వహిస్తున్న డాక్టర్లు



ఏర్పాట్లను పరిశీలిస్తున్న సిమ్స్ ప్రిన్సిపాల్ హిమబింద్ సింగ్

- సిమ్స్ మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ హిమబింద్ సింగ్
- యూపీహెచ్‌సీలో ఉచిత వైద్య శిబిరం

కోల్‌సిటీ: గోదావరిఖని అడ్డగుంటపల్లిలోని అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్(యూపీహెచ్‌సీ)లో శుక్రవారం ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి, సిమ్స్ మెడికల్ సైన్స్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరాన్ని మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ హిమబింద్ సింగ్, ఆస్పత్రి సూపరింటెండెంట్ దయాల్‌సింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా గైనిక్, జనరల్ సర్జరీ, ఆర్థో, పీడియాట్రిషన్, జనరల్ మెడిసన్ తదితర స్పెషలిస్టు డాక్టర్లు సేవలందించారు. ప్రతి నెలా ఇదే తరహాలో ఉచిత మెడికల్ క్యాంపులు నిర్వహించనున్నట్లు వారు తెలిపారు. ఈ విషయంపై డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ కృపాబాయితో కూడా ఫోన్‌లో చర్చించారు. వైద్య శిబిరానికి స్థానికులు భారీగా తరలివచ్చారు. అవసరమైన వారికి అక్కడే మందులు ఇవ్వగా, పరీక్షలు నిర్వహించాల్సిన వారిని జీజీహెచ్‌కు రెఫర్ చేశారు. కార్యక్రమంలో ఆర్ఎంవో డాక్టర్ అప్పారావు, యూపీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ మణి కేశవరెడ్డి, ప్రొఫెసర్లు, కార్పొరేటర్ జంగంపల్లి సరోజన పాల్గొన్నారు.

సపాయి కుటుంబాన్ని ప్రభుత్వపరంగా ఆదుకుంటాం



పరామర్శిస్తున్న విప్, జిల్లా పంచాయతీ అధికారి

ధర్మారం: మండలంలోని నందిమేడారం గ్రామపంచాయతీలో సపాయిగా పనిచేస్తున్న ఎల్తూరి సత్తయ్య ప్రమాదవశాత్తు మరణించాడు. అతడి కుటుంబాన్ని ప్రభుత్వ పరంగా ఆదుకుంటామని ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ హామీ ఇచ్చారు. శుక్రవారం సత్తయ్య ఇంటికి వెళ్లి వారి కుటుంబ సభ్యులను పరామర్శించి రూ.5వేలు అందించారు. లక్ష్మణ్‌కుమార్ ఆర్‌డబ్ల్యూఎస్ ఈఎన్‌సీతో ఫోన్‌లో మాట్లాడి జరిగిన సంఘటనకు వారి శాఖ అధికారుల నిర్లక్ష్యం మూలంగానే ప్రమాదం జరిగిందని బాధ్యత తీసుకోవాలని, ఆ కుటుంబాన్ని ఆర్థికంగా ఆదుకోవాలని కోరారు. ఆ కుటుంబంలో ఒకరికి వాటర్‌మెన్‌గా ఉద్యోగం కల్పించాలన్నారు. ఈఎన్‌సీ సానుకూలంగా స్పందించారు. కాగా జిల్లా పంచాయతీ అధికారి ఆశాలత మృతుడి ఇంటికి వెళ్లి వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. కుటుంబంలో ఒకరికి గ్రామ పంచాయతీలో ఉద్యోగం ఇస్తామని ఆమె హామీ ఇచ్చారు. మండల పరిషత్ అధికారి రమేశ్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు గాగిరెడ్డి తిరుపతిరెడ్డి, బ్లాక్ 2 అధ్యక్షుడు కోమటిరెడ్డి రవీందర్‌రెడ్డి, పార్టీ సీనియర్ నాయకుడు అరిగె లింగయ్య, కట్ట స్వామి, సోగాల తిరుపతి పాల్గొన్నారు.

నరేశ్ చిత్రపటానికి నివాళి

ధర్మారం: మండలంలోని కటికెనపల్లికి చెందిన కాంగ్రెస్ మండల మాజీ ప్రధాన కార్యదర్శి రేండ్ల నరేశ్ ఈ నెల 2న హత్యకు గురైన విషయం విదితమే. శుక్రవారం నరేశ్ కుటుంబసభ్యులు దశదినకర్మ నిర్వహించగా ప్రభుత్వ విప్ లక్ష్మణ్‌కుమార్, ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి పాల్గొన్నారు. అతడి చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. కాంగ్రెస్ మండల అధ్యక్షుడు తిరుపతిరెడ్డి నాయకులు రవీందర్‌రెడ్డి, కొత్త నర్సింహులు, పాలకుర్తి రాజేశంగౌడ్, బొల్లి స్వామి, రామడుగు గంగారెడ్డి, సోగాల తిరుపతి, చేపూరి శేఖర్ పాల్గొన్నారు.

పిల్లలను సర్కారు స్కూళ్లలోనే చేర్పించాలి



అక్షరాభ్యాసం చేయిస్తున్న ఎమ్మెల్యే, డీఈవో

పెద్దపల్లిరూరల్: ప్రభుత్వ పాఠశాలల్లో ఆధునిక విద్యాబోధన, అత్యాధునిక వసతీసౌకర్యాలు అందుబాటులోకి వచ్చాయని, తల్లిదండ్రులు తమ పిల్లలను తప్పనిసరిగా సర్కారు స్కూళ్లలోనే చేర్పించాలని ఎమ్మెల్యే విజయరమణారావు కోరారు. స్థానిక మండల పరిషత్ పాఠశాలలో రీడింగ్ కార్నర్ రూం, వీఐపీ ప్యానెల్స్‌ను డీఈవో మాధవితో కలిసి శుక్రవారం ప్రారంభించారు. ఈనెల 19 వరకు చేపట్టే బడిబాట కార్యక్రమం ద్వారా తల్లిదండ్రుల్లో అవగాహన పెంచేందుకు ఉపాధ్యాయులు కృషి చేస్తున్నారని ఎమ్మెల్యే అన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్యతో పాటు ఉచితంగా పాఠ్య పుస్తకాలు, దుస్తులు, మధ్యాహ్న భోజనం అందిస్తున్నారని వివరించారు. ప్రైవేట్ బడుల్లో చేర్పించి ఆర్థికంగా నష్టపోవద్దని ఆయన సూచించారు. పాఠశాల లైబ్రరీలో అవసరమైన పుస్తకాల కోసం తన వంతుగా రూ.10 వేలను విరాళంగా అందిస్తున్నట్లు ఎమ్మెల్యే ప్రకటించారు. విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, దుస్తులను అందించారు. సమావేశంలో ఎంఈవో సురేందర్, ప్రధానోపాధ్యాయురాలు మంజులత, కౌన్సిలర్లు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

హైపవర్ కమిటీ సిఫార్సులు అమలు చేయాలి



సంఘీభావం ప్రకటిస్తున్న లోకో పైలట్లు

రామగుండం: రైల్వే బోర్డు నియమించిన హై పవర్ కమిటీ సిఫార్సులను తక్షణమే అమలు చేయాలని కోరుతూ శుక్రవారం లోకోపైలట్లు సంఘీభావ ప్రదర్శన చేపట్టారు. ఆలిండియా లోకో రన్నింగ్ స్టాఫ్ అసోసియేషన్ రామగుండం బ్రాంచి సెక్రటరీ సీహెచ్.రవి మాట్లాడుతూ లోకోపైలట్లకు 46 గంటల వారాంతపు సెలవు ఇవ్వాలని, సదరన్ రైల్వేలో తొలగించిన లోకోపైలట్లను వెంటనే తిరిగి విధుల్లో చేర్చుకోవాలని కోరారు. వరుసగా మూడోరోజు రాత్రి విధులకు దూరంగా ఉంచాలని, రైల్వే బోర్డు నియమించిన హైపవర్ కమిటీ సర్వోన్నత న్యాయస్థానం కర్ణాటక, తమిళనాడు హైకోర్టు తీర్పుకు అనుకూలంగా 46 గంటల వారాంతపు సెలవు ఇవ్వాలని సదరన్ రైల్వే లోకోపైలట్లు డిమాండ్ చేయడంతో విధుల నుంచి తొలగించడం సరికాదన్నారు. లోకోపైలట్లు జగన్, దాసరి కిరణ్, అనిల్, నవారియా పురుషోత్తం మీనా, కార్తీక్, రాజబాబు తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

మున్సిపల్ సాధారణ సమావేశం

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లి మున్సిపాలిటీ సాధారణ సమావేశం శుక్రవారం జరిగింది. సమావేశంలో నాలుగో వార్డ్ కౌన్సిలర్ కొంతం శ్రీనివాస్‌రెడ్డి మృతికి వైస్‌చైర్మన్ నాజ్మీన్ సుల్తానాతో పాటు సభ్యులు రెండు నిమిషాలు మౌనం పాటించి నివాళి అర్పించారు. సమావేశంలో తీర్మానించిన అంశాలను కౌన్సిల్ సభ్యులు ఏకగ్రీవంగా ఆమోదించారు. కమిషనర్ ఆకుల వెంకటేశ్, మేనేజర్ శివప్రసాద్, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

కమాన్‌పూర్: మండలంలోని రొంపికుంట సబ్‌స్టేషన్ పరిధిలో శనివారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ రాజేంద్రకుమార్ ఒక ప్రకటనలో తెలిపారు.

గాలివానకు కూలిన రైస్‌మిల్ పైకప్పు

సుల్తానాబాద్‌రూరల్: మండలంలోని కాట్నపల్లి గ్రామపరిధిలోని మోహనకృష్ణ ఇండస్ట్రీస్ (రైస్‌మిల్) పైకప్పు గురువారం రాత్రి కురిసిన గాలివానకు కూలింది. పైకప్పు కూలడంతో దాదాపు రూ.15లక్షల వరిధాన్యం, రూ.3లక్షలకు పైగా మిషనరీ తడవడంతో నష్టం వాటిల్లిందని యాజమాని కొమురవెల్లి రాములు తెలిపారు.

షార్ట్ సర్క్యూట్‌తో ఇల్లు దగ్ధం

కమాన్‌పూర్: మండలంలోని రొంపికుంట గ్రామ పరిధిలోని తెనుగుపల్లెకు చెందిన చొప్పరి శంకర్‌కు చెందిన ఇల్లు శుక్రవారం ప్రమాదవశాత్తు షార్ట్ సర్క్యూట్‌తో ఇల్లు కాలిపోయింది. శంకర్ ఉదయం కుటుంబంతో పొలం పనులకు వెళ్లగా ఇంట్లో షార్ట్ సర్క్యూట్ జరిగింది. మంటలు రావడంతో గమనించిన చుట్టుపక్కల వారు వచ్చి మంటలను ఆర్పే ప్రయత్నం చేసినా ఇల్లు పూర్తిగా కాలిపోయింది. ఇంట్లో ఉన్న నగదుతో పాటు వస్తువులు కాలిపోయాయి. సంఘటన స్థలాన్ని రెవెన్యూ, పోలీస్, విద్యుత్శాఖ అధికారులు పరిశీలించారు.

గని ప్రమాదంలో కార్మికునికి గాయాలు

గోదావరిఖని: సింగరేణి సంస్థ రామగుండం డివిజన్ పరిధిలోని జీడీకే లెవెన్ గనిలో జరిగిన ప్రమాదంలో సింగరేణి కార్మికునికి గాయాలయ్యాయి. గనిలోని 47వ లెవల్ నార్త్ 17వ డిప్‌లో జరిగిన ప్రమాదంలో బెల్లంకొండ వెంకటేశ్వర్లు అనే సపోర్టుమెన్ వేలికి గాయాలయ్యాయి. సింగరేణి ఏరియా హాస్పిటల్‌కి తరలించి చికిత్స చేస్తున్నారు.

భగీరథ సర్వే పకడ్బందీగా నిర్వహించాలి

రామగిరి: గ్రామాల్లో నిర్వహిస్తున్న మిషన్ భగీరథ సర్వేను పకడ్బందీగా నిర్వహించాలని మంథని డీఎల్‌పీవో శంకర్ ఆదేశించారు. మండలంలోని పన్నూర్‌లో నిర్వహిస్తున్న మిషన్ భగీరథ ఇంటింటి నల్లా సర్వే తీరును శుక్రవారం పరిశీలించారు. అనంతరం పంచాయతీ రికార్డులను పరిశీలించారు. ఎంపీవో సమ్మిరెడ్డి, కార్యదర్శి సరిత పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ కాంట్రాక్ట్ కార్మికుడు మృతి

యైటింక్లయిన్‌కాలనీ: ఆర్జీ–2 ఏరియా యైటింక్లయిన్‌కాలనీ జోన్–4లో షిర్కె బస్‌స్టాప్ ఏరియాలోని సులభ్ కాంప్లెక్స్ వద్ద నివాసం ఉంటూ అదే ఏరియాలో స్కావెంజర్‌గా పనిచేస్తున్న శివరాత్రి సమ్మయ్య(42) అనే కాంట్రాక్ట్ కార్మికుడు వరంగల్ ఎంజీఎం ఆసుపత్రిలో చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందాడు. గోదావరిఖని టూటౌన్ పోలీసుల కథనం ప్రకారం సమ్మయ్య కొంతకాలం నుంచి మద్యానికి అలవాటు పడ్డాడు. 12న అర్ధరాత్రి యాసిడ్ తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. 108 అంబులెన్స్‌లో గోదావరిఖని ఏరియా ఆసుపత్రికి తరలించారు. వైద్యులు పరిశీలించి మెరుగైన వైద్యం కోసం వరంగల్ ఎంజీఎంకు తరలించారు. చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడి భార్య సరోజన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు టూటౌన్ ఎస్సై ఫరీద్ తెలిపారు.

‘తొమ్మిది నెలలుగా జీతమివ్వడం లేదు సార్’



విన్నవిస్తున్న వీఆర్ఏ నర్సయ్య దంపతులు

పెద్దపల్లిరూరల్: ‘అధికారులు చేసిన పొరపాటుకు.. మేము శిక్ష అనుభవించాల్సి వస్తోంది. మంథని ఆర్డీవో కార్యాలయానికి బదిలీపై వెళ్లిన 9నెలల కాలంగా జీతమివ్వడం లేదు’ అంటూ శుక్రవారం కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ ఎదుట వీఆర్ఏ జూపాక నర్సయ్య దంపతులు వాపోయారు. సర్వీసు బుక్‌లో పుట్టిన తేది, ఆధార్‌కార్డు తేదీకి మధ్య తేడా ఉన్నాయనే కారణంగా ట్రెజరీ అధికారులు చెల్లింపు నిలిపివేశారని పేర్కొన్నాడు. పెద్దపల్లి మండలం మూలసాలకు చెందిన జూపాక నర్సయ్య అక్కడే వీఆర్ఏగా విధులు నిర్వర్తించాడు. ఇటీవలి బదిలీల్లో నర్సయ్యను మంథని ఆర్డీవో ఆఫీసుకు పంపించారు. వేతనం కోసం ట్రెజరీకి పంపితే పుట్టిన సంవత్సరం 1965గా ఉంటే ఉద్యోగంలో చేరిన సంవత్సరం 1978గా ఉందని, 13 ఏళ్లకే ఉద్యోగం ఎలా ఇచ్చారంటున్నారని పేర్కొన్నాడు. సర్వీసు బుక్‌లో పుట్టిన తేదీని సవరించి తనకు వేతనం అందేలా చూడాలని కోరారు. సమస్య పరిష్కరించాలని కలెక్టర్ సంబంధిత అధికారులను ఆదేశించారు.

రోడ్డు ప్రమాదాల నియంత్రణకు చర్యలు



రహదారిపై స్పీడ్ బ్రేకర్ నిర్మాణం

పాలకుర్తి: పాలకుర్తి మండల ప్రధాన రహదారిపై రోడ్డు ప్రమాదాల నియంత్రణకు బసంత్‌నగర్ పోలీసులు ప్రత్యేక చర్యలు చేపట్టారు. ప్రమాదాలు జరిగే స్థలాలను గుర్తించి స్థానికంగా స్పీడ్ బ్రేకర్లు నిర్మిస్తున్నారు. ఇటీవల వేంనూర్ గ్రామ శివారులో ప్రధాన రహదారిపై వారంరోజుల వ్యవధిలో జరిగిన రోడ్డు ప్రమాదాల్లో ముగ్గురు వ్యక్తులు మరణించారు. స్పందించిన బసంత్‌నగర్ ఎస్సై స్వామి వాహనాల వేగాన్ని నియంత్రించేందుకు స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయించారు. అదేవిధంగా బసంత్‌నగర్ విమానాశ్రయం సమీపంలోని మలుపు వద్ద తరచూ ప్రమాదాలు జరిగి పలువురు మృత్యువాత పడ్డారు. చాలామంది తీవ్ర గాయాలపాలయ్యారు. రహదారిపై మలుపు ఉండడంతో వాహనదారులు గమనించక నేరుగా సమీపంలోని ఎస్సారెస్పీ కాలువలోకి దూసుకెళ్లి ప్రమాదాలబారిన పడుతున్నారు. స్థానికంగా కూడా స్పీడ్‌బ్రేకర్ల ఏర్పాటుతో పాటు మూలమలుపును సూచించేలా సైన్‌బోర్డు ఏర్పాటు చేశారు.

రక్తదాత క్రాంతికుమార్‌కు అవార్డు

మంథని: ప్రపంచ రక్తదాతల దినోత్సవం సందర్భంగా శుక్రవారం హైదరాబాద్‌లోని రాజ్‌భవన్‌లో ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ద్వారా నిర్వహించిన అవార్డుల ప్రదానోత్సవంలో మంథనికి చెందిన పోతరవేణి క్రాంతి కుమార్ బ్లడ్ డోనర్ అవార్డు అందుకున్నారు. మంథనిలోని బోయిన్‌పేటకు చెందిన క్రాంతికుమార్ 48సార్లు రక్తదానం, ఆరుసార్లు ప్లేట్‌లెట్స్ దానం చేశారు. 49వ సారి రాజ్‌భవన్‌లో క్రాంతి రక్తదానం చేశారు. అవార్డు అందుకున్న క్రాంతిని ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా చైర్మన్ కావేటి రాజగోపాల్, వైస్‌చైర్మన్ తూము రవీందర్, ఎంసీ మెంబర్ మేడగోని వెంకటేశ్ అభినందించారు.

కరాటే చాంపియన్స్‌కు కలెక్టర్ ప్రశంసలు



అభినందిస్తున్న కలెక్టర్, ఎమ్మెల్యే

గోదావరిఖనిటౌన్: ఇటీవల మలేసియా ఇంటర్నేషనల్ కరాటే టోర్నమెంట్‌లో గోదావరిఖనికి చెందిన షహాన్ మొండయ్య, శిష్యుడు అమృతసాయి విజేతలుగా నిలిచారు. అలాగే గోవాలో జరిగిన అంతర్జాతీయ కరాటే పోటీల్లో విజేతలుగా నిలిచిన ఈర్ల శ్రీనిత్య, వెల్తురు నిహారిక, వైష్ణవి, శ్రీహర్షిణిని కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్, రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ కలెక్టరేట్ కార్యాలయంలో వారిని శుక్రవారం అభినందించారు.

కొత్త గనుల ఏర్పాటుకు కృషి



మాట్లాడుతున్న వాసిరెడ్డి సీతారామయ్య

యైటింక్లయిన్‌కాలనీ: సింగరేణి సంస్థలో కొత్త గనుల ఏర్పాటుకు కృషి చేస్తామని ఏఐటీయూసీ అధ్యక్షుడు వాసిరెడ్డి సీతారామయ్య అన్నారు. శుక్రవారం ఆర్జీ–2 ఏరియా ఓసీపీ–3 కృషి భవన్‌లో నిర్వహించిన గేట్ మీటింగ్‌లో ఆయన మాట్లాడారు. సింగరేణి మనుగడ కోసం కొత్త గనుల తవ్వకం అనివార్యమన్నారు. రాష్ట్ర ప్రభుత్వంతో మాట్లాడి.. బొగ్గు బ్లాక్‌ల కోసం కేంద్ర ప్రభుత్వ చేపట్టే టెండర్లలో పాల్గొనేలా ఒప్పించామని ఆయన అన్నారు. సింగరేణి యజమాన్యం ఏఐటీయూసీకి తక్షణమే గుర్తింపు కార్మిక సంఘం ధ్రువీకరణపత్రం అందజేయాలని, కార్మికుల సమస్యలపై చర్చించేలా స్ట్రాక్చరల్, జేసీసీ సమావేశాలు ఏర్పాటు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. పెర్క్స్‌పై ఆదాయపు పన్ను రీయింబర్స్‌మెంట్, పాత పద్ధతిలోనే స్లాబ్‌లు, పీహెచ్‌డీలు అమలు చేయాలని కోరారు. కార్మికులకు సీఎంపీఎఫ్ స్లిప్పులు వెంటనే అందించాలన్నారు. కొన్ని సంఘాల నాయకులు తమతోనే సమస్యలు పరిష్కారమవుతున్నాయని ప్రచారం చేసుకోవడం విడ్డూరంగా ఉందని విమర్శించారు. నాయకులు ఎల్.ప్రకాశ్, వైవీ రావు, రాజారత్నం, రాంచందర్, రవీందర్, అన్నారావు, శాంసన్, సాంబశివరావు, వేంకటేశ్వర్లు, రవికుమార్, మహేందర్, కనుకయ్య, బుర్ర తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

పారదర్శకంగా ఈపీ ఆపరేటర్ ఎంపిక



మాట్లాడుతున్న జీఎం ఎన్.సుధాకర్ రావు

రామగిరి: అంతర్గత ఈపీ ఆపరేటర్ ట్రైనింగ్ ప్రాక్టికల్ పరీక్షలు పారదర్శకంగా నిర్వహిస్తామని ఆర్జీ–3 జీఎం ఎన్.సుధాకర్‌రావు అన్నారు. శుక్రవారం జీఎం కార్యాలయ సమావేశ మందిరంలో ఈపీ ఆపరేటర్ ట్రైనింగ్ పోస్టుల భర్తీకి నిర్వహించే ప్రాక్టికల్ పరీక్షలకు సంబంధించిన ఏర్పాట్లపై అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆర్జీ–2, 3, ఏపీఏ ఏరియాల్లో విధులు నిర్వహిస్తున్న సింగరేణి ఉద్యోగులు 332 మంది ఈపీ ఆపరేటర్ పరీక్షకు దరఖాస్తు చేసుకున్నారని పేర్కొన్నారు. ఆర్జీ–3 ఏరియాలోని సెంటనరీకాలనీ రాణిరుద్రమ దేవి స్టేడియంలో ఈ నెల 18 నుంచి 20 వరకు ప్రాక్టికల్ పరీక్షలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఎస్‌వోటూ జీఎం జి.రఘుపతి, ఏరియా సేఫ్టీ అధికారి సీ.హెచ్.వెంకటరమణ, ప్రాజెక్టు అధికారి కె.రాజేందర్, ఐఈడీ, సివిల్ డీజీఎంలు చంద్రశేఖర్, పద్మరాజు, పర్సనల్ మేనేజర్ ముప్పిడి రవీందర్‌రెడ్డి, ఏరియా సెక్యూరిటీ అధికారి ఈ.లక్ష్మీనారాయణ, ప్రాజెక్టు ఇంజనీర్లు ఆర్.శ్రీనివాస్, ఎం.నాగరాజు, డా.కళ్యాణ్ చక్రవర్తి పాల్గొన్నారు.

కార్మికులకు ఆదాయ పన్ను రాష్ట్ర ప్రభుత్వమే చెల్లించాలి



మాట్లాడుతున్న యాదగిరి సత్తయ్య

గోదావరిఖని: సింగరేణి కార్మికులకు ఆదాయ పన్ను రాష్ట్ర ప్రభుత్వమే చెల్లించాలని సింగరేణి కోల్ మైన్స్ కార్మిక సంఘం బీఎంఎస్ రాష్ట్ర అధ్యక్షుడు యాదగిరి సత్తయ్య కోరారు. ఆర్జీ–1 పరిధిలోని జీడీకె 2ఏ గనిలో శుక్రవారం జరిగిన గేట్ మీటింగ్‌లో ఆయన మాట్లాడారు. సింగరేణి సంస్థ నుంచి ప్రతి ఏటా వేల కోట్ల రూపాయలు రాష్ట్ర ప్రభుత్వానికి చెల్లిస్తున్నారని, పన్నుల నుంచి సింగరేణి కార్మికులకు మినహాయింపు ఇవ్వాలన్నారు. సింగరేణి సంస్థలో మారుపేర్లు మార్పిడి చేయాలని గతంలో అనేక ఆందోళన కార్యక్రమాలు చేపట్టామని, డిప్యూటీ సెంట్రల్ లేబర్ కమిషనర్ వద్ద జరిగిన సెటిల్‌మెంట్ అమలు చేయాలని కోరారు. ఆర్జీ–1 ఏరియా ఉపాధ్యక్షుడు ఆకుల హరిణ్, కేంద్ర ఉపాధ్యక్షుడు వై.సారంగపాణి, నాయకులు తాట్ల లక్ష్మయ్య, సంగాని సాంబయ్య, తడగొండ నర్సయ్య, కుమ్మరి నాగేష్, చీకట్ల మల్లేశ్, గొడుగు సమ్మయ్య, చిగురు లక్ష్మణ్, అశోక్, శ్రీకాంత్, మల్లేశ్, సుమన్, చంద్రయ్య, ప్రవీణ్, వినోద్, శంకర్ పాల్గొన్నారు.

విద్యుత్ ప్రమాదాల నివారణపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న రాజీవ్ వర్మ

యైటింక్లయిన్‌కాలనీ: విద్యుత్ ప్రమాదాల నివారణపై శుక్రవారం డీఎంఎస్ ఎలక్ట్రికల్ సౌత్ జోన్ హైదరాబాద్ రాజీవ్ వర్మ ఆర్జీ–2 ఏరియా ముఖ్య అధికారులకు సంబంధిత విభాగం అధికారులకు సూపర్‌వైజర్లకు, ఎలక్ట్రికల్ ఫోర్‌మెన్స్, సిబ్బందికి అవగాహన కల్పించారు. అంతకుముందు ఆర్జీ–2 జీఎం సూర్యనారాయణ, రామగుండం రిజియన్ రక్షణ జీఎం కెహెచ్ఎస్ గుప్తాలతో విద్యుత్ ప్రమాదాలపై చర్చించారు. అనంతరం కాన్ఫరెన్స్ హాల్‌లో విద్యుత్ ప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై పవర్ పాయింట్ ప్రజంటేషన్ ఇచ్చారు. ఆర్జీ–2 జీఎం సూర్యనారాయణ, రామగుండం రీజియన్ రక్షణ జీఎం గుప్తా, ఓసీపీ–3 ప్రాజెక్ట్ అధికారి మధుసూదన్, వకీల్‌పల్లి గని ప్రాజెక్ట్ అధికారి శ్రీనివాస్‌రెడ్డి, ఎస్‌వోటూ వెంకటేశ్వర్‌రావ్, రక్షణ అధికారి రవీందర్, ఇంజనీర్ నరసింహారావ్, రాజాజ్, డీజీఎం వర్క్‌షాప్ ఎర్రన్న, మేనేజర్లు రమేశ్, రవికిరణ్ పాల్గొన్నారు.

ఫైర్ సేఫ్టీపై అవగాహన అవసరం

పెద్దపల్లిరూరల్: జిల్లాలోని పలు ఆసుపత్రుల్లో అగ్నిప్రమాదాలు సంభవిస్తే అనుసరించాల్సిన పద్ధతులపై యజమాన్యాలు, సిబ్బందికి అవగాహన కల్పించామని ఫైర్ ఆఫీసర్ దేవనంది శ్రీనివాస్ తెలిపారు. పట్టణంలో శుక్రవారం శ్రీనిక పిల్లల ఆసుపత్రిలో మాక్‌డ్రిల్ నిర్వహించారు. అగ్ని ప్రమాద నియంత్రణకు ఉపకరించే పరికరాలను పరిశీలించి సూచనలిచ్చారు. ఫైర్‌మెన్ శ్రీనివాస్, నరేందర్ ఉన్నారు.

‘మైలేజ్ ఇవ్వని వాహనాలొద్దు సార్’



కమిషనర్‌కు విన్నవిస్తున్న డ్రైవర్లు

కోల్‌సిటీ: ‘ఇంటింటికీ తిరిగి చెత్త సేకరించే వాహనాల్లో కొన్ని వాహనాల లైఫ్ ముగిసింది. అలాంటి వాహనాలకు టార్గెట్ ప్రకారం మైలేజీ రావాలని కొత్తగా ఆంక్షలు విధిస్తున్నారు. ఈ విధానాన్ని తొలగించండి.. క్రమం తప్పకుండా వాహనాలకు మెయింటనెన్స్ చేపట్టకపోవడంతో చాలా వాహనాలకు ఆశించినస్థాయిలో మైలేజీ రావడం లేదు.. ఇలాంటి వాహనాలను ఇవ్వకండి సార్..’ అంటూ రామగుండం నగరపాలక సంస్థ పారిశుధ్య విభాగంలోని ట్రాక్టర్లు, ఆటోట్రాలీ డ్రైవర్లు కమిషనర్ సీహెచ్.శ్రీకాంత్‌కు విన్నవించారు. శుక్రవారం డ్రైవర్లు మూకుమ్మడిగా వెళ్లి కమిషనర్‌ను కలిసి సమస్యలు వివరించారు. గతంలో లేనివిధంగా తక్కువ పెట్రోల్, డీజిల్ పోసి ఎక్కువ మైలేజీ వచ్చేలా వాహనాలను నడపాలని అధికారులు ఆంక్షలు విధిస్తున్నారని కమిషనర్‌కు తెలిపారు. స్పందించిన కమిషనర్ మరమ్మతుతో ఉన్న వాహనాల సమస్యలు పరిశీలిస్తామని తెలిపారు. పారిశుధ్య విభాగంలోని పర్యవేక్షణ అధికారుల సూచన మేరకు, వాహనాలు మైలేజీ వచ్చేలా నడపాలని డ్రైవర్లకు సూచించారు. కార్మిక సంఘాల నాయకుడు నడిపెల్లి మురళీధర్‌రావుతోపాటు పలువురు కార్మిక సంఘాల నాయకులు, కార్మికులు ఉన్నారు.

రక్తదానం చేయడం సామాజిక బాధ్యత

కోల్‌సిటీ: రక్తదానం చేయడాన్ని యువత సామాజిక బాధ్యతగా తీసుకోవాలని గోదావరిఖని ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి(జీజీహెచ్) మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ దయాల్‌సింగ్ పిలుపునిచ్చారు. ప్రపంచ రక్తదాతల దినోత్సవం పురస్కరించుకొని స్థానిక ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలోని బ్లడ్ సెంటర్‌లో శుక్రవారం 12 మంది రక్తదాతలు స్వచ్ఛందంగా రక్తదానం చేశారు. ఈ సందర్భంగా వారిని అభినందిస్తూ సూపరింటెండెంట్ ప్రశంసా పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో ల్యాబ్ టెక్నీషియన్ సంపత్, డీఈవో అక్బర్, నర్సింగ్ ఆఫీసర్లు కీర్తన, లావణ్య పాల్గొన్నారు.

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
పెద్దపల్లి జిల్లా:
9951602934
Office mail : knrjagati@gmail.com

సాక్షి
పాఠక మహాశయులకు విజ్ఞప్తి
మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా, లేక సాక్షికి బదులుగా ఇతర దిన పత్రికలు వేస్తున్న యెడల ఈ ఫోన్ నంబర్లకు ఉదయం 7.00 గం॥ల నుండి రాత్రి 8.00 గం॥ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును.
పెద్దపల్లి : కె.తిరుపతి, ACO - 7997958206
పెద్దపల్లి : ఎం.మహేందర్, SR - 9573331940
మంథని : రాజేశ్ - 9676603963
రామగుండం : సర్వర్ - 6281694028
టోల్ ఫ్రీ నెం. : 1800 425 9899